
# మాతృవేదన

ఉర్దూమూలం:
హమ్రాఖురేషీ

తెలుగు అనువాదం:
కె.ఆర్.కె. మోహన్



**'హలో...అంజలీ ...నా మాటలు వినిపిస్తు న్నాయా? నాకు చాలా అవసరమైన మీటింగ్ ఉంది. ఇంటి కి తిరిగొచ్చేటప్పటికి దగ్గర దగ్గర పదవుతుంది.'**

"కానీ మీరన్నారూ...."

"కాస్త అర్థం చేసుకోడానికి ప్రయత్నించు అంజలీ! వద్దు...వద్దు డిన్నర్ విషయం వదిలేయి. మీటింగ్ అయాక ఇక్కడెలాగూ డిన్నర్ ఉంది."

"నేను మీతో...."

"డార్లింగ్...నేను చాలా తొందరలో ఉన్నాను. సీయూ.."

నన్ను మాట్లాడనియ్యకుండానే ఆయన ఫోన్ పెట్టేశారు. నా మనసు వికలమై పోయింది. ప్రతి సాయం త్రం ఇంతే! ఏదో ఒక సాకు. నాతో గడపడానికి ఆయనకు సమయమే చిక్కదు. మాయదారి మీటిం గులు! వీటిని సాయంత్రమే ఎందుకు పెడ్తారో! నాలో నేనే గొణుక్కున్నాను. ఒక సివిల్ అధికారి భార్యగా అంతంలేని ఈ నిరీక్షణకు నేను కొంతవరకూ అలవాటు పడిపోయాను. ఈ విషయం మీద మా మధ్య ఎన్నోసార్లు వాగ్వివాదాలు జరిగాయి. కాని ఆయన మాత్రం ఈ విషయంలో తానేమీ చేయలేనని తెగేసి చెప్పాడు. జీతం తీసుకుంటున్నందుకు ఇలాం టివి తప్పవట!

"కట్టుబానిసలాగా ఏమిటీ వెట్టిచాకిరీ! అందు లోనూ మీ సేవలకు ప్రతిఫలం కానీ, గుర్తింపు కానీ లేనప్పుడు! ఏ ప్రభుత్వం వచ్చినా మీ షర్టుకాలరు పుచ్చుకుని లాగి మీ చేత పనిచేయిస్తుందా?" అని నేను వాదించేదాన్ని. అయితే నామాటలన్నీ చెవిటి ముందు శంఖూదినట్లయేవి. నా మటుకు నేను ఆయన అంతరంగాన్ని అర్థం చేసుకోలేక పోతున్నాను.

నా దృష్టిలో ప్రతిస్త్రీ ఒక స్థితిలో తనని భర్త పట్టించుకోనట్లూ, గాలికి వదిలేస్తున్నట్లూ భావిస్తుంది. ప్రస్తుతం నేనూ ఈ స్థితిలోనే ఉన్నాను. ఆయనకి ఆఫీసు తప్ప వేరేమీ పట్టదు.

మా పిల్లలిద్దరూ పదేళ్ళు దాటిన వాళ్లే! వాళ్లిద్దరికీ ఈతకొట్టడమంటే ప్రాణం. స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లారు. వాళ్లూ లేకపోవడంతో, పూర్తి ఒంటరితనం నన్ను ఆవహించింది.

"కనీసం నీకు పిల్లలున్నారు. లేకుంటే పిచ్చెక్కి ఉండేది." షీలా అన్నమాటలు పదేపదే నా చెవుల్లో మార్మోగసాగాయి. ఆ మాటలే నా మనసుకి కాస్త ఊరట కలిగిస్తుంటాయి. నిజమే... కానీ ఇలా ఎంత కాలం? వాళ్లు మాత్రం నా రెక్కల కింద ఎన్నాళ్లుం టారు? కొద్ది సంవత్సరాలలోనే వాళ్ల ప్రపంచంలో వాళ్ళూ సొంతబతుకు మొదలుపెడతారు. మా పిల్లలు అనూ, రోహిత్ బుద్ధిమంతులే! కానీ ఇటీవల మా మధ్య శూన్యం ఏర్పడుతున్నట్లు, పరస్పరావగాహన కొరవడుతున్నట్లు అనిపిస్తోంది. వాళ్లూ నాకు అంతకంతకీ దూరం అవుతున్నట్లు, నన్ను వాళ్ల విషయాల్లో అనవసరంగా జోక్యం చేసుకుంటున్న పరాయివ్యక్తిగా భావిస్తున్నట్లు అనిపిస్తోంది. ఇటువంటివన్నీ తప్పవనీ, ఈ మార్పు సహజమేననీ నాకు తెలుసు. అందుకే నన్ను నేను ఓదార్చుకోడానికి ప్రయత్నించాను. అయినా నేనెందుకు భయపడాలి? బహుశా నాలో కొంతస్వార్థ చింతన ఉండివుండవచ్చు. నావారినుంచి నాకేదో కావాలనే కోరిక నాలో ఉండటం వల్లకావచ్చు. వయసు తో పాటు వాళ్లు నిర్వహించే బాధ్యతలూ, ప్రదర్శించే ధోరణులు తప్పనిసరిగా మారుతుంటాయి. అయితే మాత్రమేం ... నేను వాళ్ల కన్నతల్లినయినప్పుడు నాతో నిష్కపటంగా, నిస్సంకోచంగా ఉండవచ్చు కదా!

వీళ్ళు నా కడుపులో ఉండగా ఎంతబాధపడ్డాను? చీటికి మాటికి రక్తపరీక్షలు చేసేవారు. ఇంకపురిటి సమయంలో నలభైఎనిమిది గంటలపాటుపడ్డ నరక యాతన ఆ దేవుడికే తెలుసు! ఈ మాటలు కనుక నేను పిల్లలతో అంటే "అమ్మా... మమ్మల్ని కని దేశం కోసం ఏదో త్యాగం చేసినట్లుగా మాట్లాడకు. నీ సుఖం కోసం నాన్నగారితో గడిపావు. మేము పుట్టాం అంతే! అసలు మమ్మల్ని కనకుండావుంటే ఇంకా హాయిగా ఉండేవాళ్లం." అంటారు నిస్సంకోచంగా.

నా ఆలోచనలు మా పదిహేనేళ్లఅమ్మాయి అనూ మీదకు మళ్లాయి. దానికి 'ఏదో' జరుగుతున్నట్లనిపిస్తోంది. దానిలో అంతర్గతంగా ఏదో ప్రేరణ కలుగుతోంది. మామూలుగా ఇంట్లో ఉన్నప్పుడు ముభావంగా ఉండే దాని ముఖంలో కళాకాంతులు పెరిగిపోతున్నాయి. ఆ వెలుగు చూస్తూంటే అనూ పరాయిపిల్ల కాదుకదా, అని అప్పుడప్పుడూ అనిపి స్తుంది. అటుతర్వాత అమ్మాయిలో మరొక విధమైన మార్పు వచ్చింది. ఎంతసేపూ ఏదో ఊహాలోకంలో విహరిస్తున్నట్టు, దిగులుగా, ఏదో పోగొట్టుకున్నట్టూ

అనిపించసాగింది. టెలిఫోన్ బెల్ మోగినప్పుడు మాత్రం దాని ముఖంలో చైతన్యం వచ్చేది. ఎరుపెక్కిన బుగ్గలతో ఆ కాల్‌ని రిసీవ్ చేసుకోడానికి పరిగెత్తేది. మామూలుగా అయితే చెప్పినా కూడా టెలిఫోన్ దగ్గరికి వెళ్లేది కాదు. అటువంటిది చెప్పకుండానే ప్రతి టెలిఫోన్‌కాల్‌నూ రిసీవ్ చేసుకోడానికి పరుగులు పెడ్తుండటం వింతగా ఉంది. ఒక్కొక్కసారి ఇన్‌స్ట్రుమెంటును ప్లగ్ నుండి ఊడదీసి టాయిలెట్‌లోకి తీసికెళ్లి అక్కడి ప్లగ్‌కి తగి లించి, అక్కడి నుండే మాట్లాడుతూ ఉండేది. ఒకవేళ వేరేచోట మాట్లాడినా, రిసీవర్ దగ్గర గుసగుసలాడేదే గానీ , తన మాటలు ఇతరులకి వినబడనిచ్చేది కాదు.

అనూ ప్రవర్తనలోని మార్పుకి కారణం నేను తేలి గ్గానే అర్థం చేసుకోగల్గాను. కాని నేనేమీ జోక్యం చేసు కోదల్చలేదు. అది జీవితంలో ఒక మధురాతి మధుర ఘట్టం. దానిని అలాగే ఉండనీయాలి. లేకుంటే ఈ మనఃఫలకం మీద అసహ్యకరమైన మరకలు ఏర్పడు తాయి. ఒక విధంగా అనూ ప్రవర్తన నాకు కొంత ఆనందాన్ని కల్గిస్తోందనే చెప్పాలి. ఎందుకంటే అది ఇరవయ్యేళ్ల క్రితం నా జీవితంలో కలిగిన మధురాను భూతులను గుర్తుచేస్తోంది. అందుకే కాబోలు చరిత్ర పునరావృతమౌతుందంటారు. ఆ రోజుల్లో నా ప్రవర్తన మూలంగా అమ్మానాన్నల బ్లడ్‌ప్రెషర్ పెరిగిపోతుండేది; వాళ్ల కంటికికునుకు పట్టేది కాదు. నాకు టెలిఫోన్ వచ్చినప్పుడల్లా ఆ దగ్గర్లోనే తచ్చాడుతుండువారు. నా కొస్తుండే ఉత్తరాలు గురించి ఆరాలు తీస్తుండే వారు. నాకు ఇస్తుండిన పాకెట్‌మనీని బాగా తగ్గించి వేశారు. నేను బయటకు వెళ్లినప్పుడు నాకు తెలియ కుండా వెన్నాడుతుండే వారు. ఇదంతా తమని తిట్టుకునే కూతురిని సంరక్షించుకోవడం కోసం! అది నా అను భవం కనుకనే అనూ విషయంలో నేను ఆ విధంగా ప్రవర్తించదలుచుకోలేదు. ఆ అనుభవాలను స్వయంగా పొంది ఏదిమంచో ఏదిచెడో నిర్ణయించుకునే విషయం దాని ఇంగితానికే వదిలివేయదలిచాను. పైగా అది నాపై నమ్మకం ఉంచనప్పుడు నేనెందుకు కల్పించు కోవాలి? ఇతరులు కల్పించుకుంటే పట్టుదల మరింత ఎక్కువవుతుందన్న విషయం అనుభవపూర్వకంగా నాకు తెలుసు. ప్రతివారి జీవిత గమనంలోనూ ఈ మజిలీ సామాన్యమే! నన్నడిగితే ఇటువంటి అనుభవం లేని వారు దురదృష్టవంతులంటాను. ఎంతో ప్రయత్నం చేసి కూడా ఈ అనుభూతిని పొందలేక పవిత్రతని నటిస్తూ- "ఇటువంటివి మేం ఎరుగమమ్మా!" అంటూ నంగనాచి కబుర్లు చెప్పేవారిని నయవంచకులుగా పరిగణిస్తాను నేను.

అనూ పరిస్థితిని నేను అర్థం చేసుకోగలను. చివరికి ఇది తెగిన గాలిపటంలాగా వదిలి వేయడం జరిగితేనో! నిజమే...అదీ సంభవమే! అలా జరగడం కూడా సంభవమే! ఏమైనా చివరదాకా వేచి ఉండటమే మంచిదని నిర్ణయించుకున్నాను. పరిస్థితిని ఎలా చక్కదిద్దుకోవాలో దిక్కుతోచక అనూ తానే నా సహాయం కోరవచ్చు. అదీ కాకపోతే ఈ పరిస్థితి ఆమె జీవితంలో ఎంత నెమ్మదిగా ప్రవేశించిందో అంతనెమ్మదిగానూ తొలగిపోవచ్చు.

రెండు సైకిళ్లు టకటకా శబ్దం చేస్తూవచ్చాయి. తర్వాత రోహిత్ నవ్వు గలగలా వినిపించింది. "అమ్మా ...తలుపుతీయి..మేం వచ్చాం" అన్నపిలుపు వినిపిం చింది. అంతటితో తీవ్రంగా చెలరేగుతున్న నా ఆలోచనలకు అవరోధం ఏర్పడింది. వాళ్లు అప్పుడే ఈతకొట్టి వచ్చారు. హుఁ కనీసం నాకు పిల్లలున్నారు. లేకుంటేనా నా ఆలోచనా తరంగాలకి అడ్డూఅదుపూ ఉండేది కాదు.

అనూలో 'ఆ' లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తు న్నాయి. నిజానికి ఈరోజున ఆ అమ్మాయిలో ఎంతో నిస్పృహ, దిగులు కనిపిస్తున్నాయి. ఎంతోసేపు ఒంటరిగా ఉండాలని కోరుకుంటోంది.

రోహిత్ ఒక్కసారి భుజాలు ఎగరేసి తనకేమీ పట్టనట్టు గదిలోకి వెళ్లిపోయాడు. అనూకి ఏర్పడిన సమస్యని నేనూ పంచుకోవాలనుకున్నాను. కానీ ఎలా? నా అంతట నేను జోక్యం చేసుకోకూడదని అనిపిస్తున్నా, ఆమెలో చెలరేగుతున్న తుఫాన్‌ని ధైర్యంగా ఎదుర్కొ నేందు కు సహాయపడాలనుకున్నాను. తన వెనకాలే నేనూ గదిలోకి వెళ్లాను. అనూ ఏమీ మాట్లాడకుండా మంచంమీద పడుకుని ఏదో పుస్తకం చదవడానికి వ్యర్థప్రయత్నం చేయసాగింది.

నేను దగ్గరికి వెళ్లి "అనూ...నేనేమైనా సహాయం చేయగలనా అమ్మా!" అని లాలనగా అడిగాను. నా అనునయ వాక్యాలు ఆమెలో అంతర్గతంగా అణిగిఉన్న భావాల, ఉద్రేకాల మీద చల్లగా తట్టినట్లున్నాయి. వెంటనే అనూ దుఃఖం కట్టలు తెంచుకుంది. "వాడు నన్ను సర్వనాశనం చేశాడు, ఏం చెయ్యాలో తోచడం లేదు." అంటూ రోదించసాగింది.

నేను అనూని ఓదార్చాలనుకున్నాను. ఎంతో చెప్పా లనుకున్నాను. నా అనుభవాలన్నీ దాని ముందు గుప్పించాలనుకున్నాను. ఒకసారి జీవితంలో దెబ్బ తిన్నంత మాత్రంతో లోకమేమీ పరిసమాప్తి కాదని ధైర్యం చెప్పాలనుకున్నాను. నిజానికి ఒక వయసులో ఉన్న ఆడపిల్ల జీవితం ఇప్పుడే ప్రారంభమౌతుంది. జీవితంలో ఇటువంటి చేదుఅనుభవాలనెన్నింటిని చూడాలో! ఎన్నిమార్లు గుండెలు పగలాలో! ఇవన్నీ ఎంతో దారుణమైన విషయాలు. అయినా జరగక తప్పదు. ఎన్నెన్నో ఆలోచనలు నాలో ముప్పిరిగొన్నాయి. భావాలు బలంగా బయటకు నెట్టుకువస్తున్నా పెదవి మాత్రం విప్పలేకపోయాను. నేను చేయగలిగినదల్లా ఆమెను గట్టిగా హృదయానికి హత్తుకోవడమే! ఆమె దుఃఖాన్ని, దెబ్బతిన్న అహాన్ని, పొందిన అవమానాన్ని అన్నిటికీ నేను స్పందించగలుగుతున్నాను. ఆ నిమి షంలో నేను అనూతో ఎప్పుడూ లేనంత సన్నిహితత్వాన్ని పొందాను. ఆ సమయంలో నా భావాలకు భాష లేకపోవచ్చు కాని నేను ఎంతగానో పరితపించిన అవగాహన సిద్ధించిన అనుభూతి కలిగింది.... Ⓟ


## పెళ్ళి సంబంధములు

అన్ని కులముల, మతముల, డాక్టర్లు, ఇంజనీర్లు, ప్రభుత్వోద్యోగులు, వ్యాపార పారిశ్రామికవేత్తలు, దేశ, విదేశ మేలైన పెళ్ళి సంబంధాలకై సంప్రదిం చండి.

కృష్ణవేణి కళ్యాణ వేదిక
పోస్టాఫీసు దగ్గర
భరత్‌నగర్ కాలనీ—హైదరాబాద్—18
ఫోన్ నెంబరు: 3713894

గమనిక: వితంతువులు, విడాకులు పొందిన వారు ద్వితీయ వివాహము కొరకై సంప్రదించ వచ్చును.

శుక్రవారం—శెలవు
పని వేళలు: 10.00 A.M.To7.00P.M